


కొడైకెనాల్, ఊటీలకు 'వయనాడు' తరహా ముప్పు?

● నిపుణుల హెచ్చరికతో ఆగమేఘాలపై ముందుజాగ్రత్త చర్యలకు ప్రణాళికలు

చెన్నై, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రం వయనాడులో సంభవించిన ముప్పును చూసి ముక్కున వేలేసుకున్నాం.. అక్కడ ప్రకృతి సృష్టించిన విలయాన్ని చూసి విలవిల్లాడిపోయాం.. మరి మన రాష్ట్రంలోని ఊటీ, కొడైకెనాల్ కొండ ప్రాంతాల పరిస్థితి ఏంటో ఊహించగలరా?.. ఇక్కడా అలాంటి ముప్పే పొంచి వుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీంతో అప్రమత్తమైన ప్రభుత్వం.. ఆ రెండు ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడకుండా ముందుజాగ్రత్త చర్యలు చేపట్టింది. ఇందుకు అవసరమైన ప్రణాళికలను యుద్ధప్రాతిపదికన రచిస్తోంది.

వయనాడులోని ముండక్కై, మెప్పాడి, సురల్‌మలై కొండ గ్రామాల్లో గత నెల 30వ తేది కురిసిన భారీ వర్షానికి కొండ వరద వచ్చి భారీ కొండచరియలు విరిగిపడ్డాయి. శిథిలాల్లో చిక్కుకొని, రాళ్లు తగిలి వందలాది మంది ప్రాణాలు కోల్పోగా, ఎంతోమంది గాయపడిన విషయం తెలిసిందే. వయనాడు ప్రధాన పర్యాటక కేంద్రం కావడంతో, కొండల వాలుపై అనేక పర్యాటక రిసార్ట్‌లను నిర్మించారు. కేరళ వెళ్లే పర్యాటకులు వాయనాడుకు తప్పకుండా వెళ్తుంటారు. వాహనాలు వెళ్లేందుకు కూడా కొత్త రోడ్లు నిర్మించారు. ప్రకృతి విరుద్ధంగా పర్యాటక ప్రాంతాల అభివృద్ధి ప్రాజెక్టుల కింద అడవిని ధ్వంసం చేశారని, ఈసారి నైరుతి రుతుపవనాల్లో నేల పట్టు కోల్పోయి వాన నీరు అంతరాల్లోకి చేరి కొండచరియలు విరిగిపడడం జరిగిందని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వయనాడు మాదిరిగానే, రాష్ట్రంలో కొడైకెనాల్, ఊటీ, సిరుమలై, ఏర్కాడు, కొల్లి కొండ వంటి ప్రధాన వేసవి విడిది కేంద్రాల్లో కొండచరియలు విరిగిపడే అవకాశముందని వారు హెచ్చరిస్తున్నారు. కొడైకెనాల్, సిరుమలై, ఏర్కాడు, ఊటీల్లో పర్యాటక హోటళ్లు, వీఐపీ ఫామ్ హౌస్‌లు, నివాసాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. బోరు బావులు కూడా ఏర్పాటుచేసుకుంటున్నారు. కొడైకెనాల్, సిరుమలై వంటి వేసవి విడిది కేంద్రాలు సహా ప్రతి పర్యాటక ప్రదేశానికి చేరుకోవడానికి రోడ్డు సదుపాయం కల్పించారు.

కొడైకెనాల్ కొండ రహదారిపై రాళ్లు, మట్టిపెళ్లలు పడి తరచూ రాకపోకలను ప్రభావితం చేస్తున్నాయి. చిన్న చిన్న ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. కొడైకెనాల్‌లో 1993లో తీసుకొచ్చిన 'మాస్టర్ ప్లాన్'కు విరుద్ధంగా భవనాలు నిర్మించారు. దీనికి సంబంధించి హైకోర్టులో కేసులు నడిచి ఆయా భవనాలపై చర్యలు తీసుకున్నా, అక్రమ భవనాల సంఖ్య తరగక పోగా, పెరుగుతూనే ఉంది. అదే విధంగా, తేని జిల్లాలో నిరంతరం వర్షాలు కురుస్తున్నప్పుడు, బోడి మెట్టు కొండ, గంపమెట్టు కొండ కనుమపై రాళ్లు దొర్లుతుంటాయి. తరచుగా కొండ చరియలు విరిగిపడుతుంటాయి. ఈ ప్రమాదాలు, కొండ చరియలు విరిగిపడడాన్ని వెంటనే దిండుగల్, తేని జిల్లా యంత్రాంగం రాష్ట్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి విపత్తుల నివారణ చర్యలు చేపట్టాలని పర్యావరణవేత్తలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. పర్యాటక అభివృద్ధి గురించి మాత్రమే ఆలోచించకుండా పర్యావరణ దార్శనిక ప్రణాళికలు రూపొందించి, ముఖ్యమైన వేసవి విడిది కేంద్రాల నిర్వాహకులకు సూచించాలని వారు కోరుతున్నారు.

నియంత్రణ లేకుండా కొండ ప్రాంతాల్లో నివాసం...

పర్యావరణ వేత్త అరుణ్‌కుమార్ మాట్లాడుతూ... "నీలగిరి అడవులను తొలగించి తేయాకు తోటలుగా మార్చారు. పర్వత సానువుల్లో భవనాలు నిర్మించరాదనే నిబంధన ఉంది, అయితే కొండచరియల్లో భవనాల సంఖ్య పెరుగుతోంది. బ్రిటీష్ పాలనలో కొడైకెనాల్, ఊటీ ప్రాంతాల్లో కొంతమంది వ్యక్తుల నివాసానికి అనుమతిచ్చారు. కానీ నేడు ఎలాంటి ఆంక్షలు లేవు. ఇతర నగరాల మాదిరిగానే ప్రజలు కొడైకెనాల్, ఊటీలో స్థిరపడుతున్నారు. కొడైకెనాల్, ఎలివాల్ జలపాతం వ్యూ పాయింట్ వద్ద 2022, 2024 సంవత్సరాల్లో కొండచరియలు విరిగిపడ్డాయి. చిత్తరేవు, తడియన్ కాటేజీల మధ్య రహదారిపై ప్రతి ఏటా వర్షాకాలంలో కొండచరియలు విరిగిపడుతున్నాయి. మున్నార్, కుముళి వంటి ప్రదేశాల్లో కొత్త భవనాల నిర్మాణానికి అనుమతి లేదు. కానీ, కొడైకెనాల్, ఊటీలో మాత్రం అలాంటి కఠినమైన నిబంధనలు పాటించడం లేదు. కొత్తగా ఇళ్ల నిర్మాణానికి అనుమతివ్వరాదు. వయనాడు విలయం చేసిన హెచ్చరికను ప్రభుత్వం గ్రహించాలి" అని సూచించారు.

కోకల్ సమీపంలో భూమి, ఇళ్లలో పగుళ్లు

నీలగిరి జిల్లా గూడలూరు సమీపంలోని కోకల్‌లో భూమి, ఇళ్లపై పగుళ్లు ఏర్పడిన ప్రాంతాలను కేంద్ర భూగర్భ శాఖ నిపుణులు బుధవారం పరిశీలించారు. వారు 20 రోజులు అక్కడే వుండి పరిశీలించనున్నారు. కొక్కల్ ప్రాంతంలో జూన్ 27, 28 తేదీల్లో కురిసిన భారీవర్షాల సమయంలో, 'ఒకటిన్నర సెంట్'గా పిలిచే నివాస ప్రాంతాల్లోని ఇళ్లు, నర్సింగ్ హోమ్ భవనాలు పగుళ్లు ఏర్పడి దెబ్బతిన్నాయి. అ పగుళ్లు రోజురోజుకు పెరుగుతుండడంతో, గత వారం కేంద్ర జియాలజీ శాఖ అధికారులు ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ నేపథ్యంలో, కేంద్ర భౌగోళిక శాఖకు చెందిన ఇద్దరు అధికారులు బుధవారం మరోమారు చెన్నై నుంచి గూడలూరు చేరుకొని బాధిత ప్రాంతాలు పరిశీలించారు.



కోకల్‌లో పగుళ్లను పరిశీలిస్తున్న అధికారులు

'తమిళ్ పుదల్వన్' కి నేడు శ్రీకారం

● కోవైలో ప్రారంభించనున్న సీఎం

● 3.28 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి

చెన్నై, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం మరో కొత్త పథకానికి శ్రీకారం చుట్టనుంది. 'తమిళ్ పుదల్వన్' అనే పథకాన్ని అమలు చేయనుంది. ఈ పథకం కింద ఆరో తరగతి నుంచి ప్లస్ టూ వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నెలకు రూ.వెయ్యి ఆర్థిక సాయం అందజేయనున్నారు. ఈ మొత్తాన్ని బ్యాంకు ఖాతాల్లో డిపాజిట్ చేస్తారు. ఈ పథకాన్ని ముఖ్యమంత్రి స్టాలిన్ శుక్రవారం కోయంబత్తూరులో లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ పథకం కింద దాదాపు 3.28 లక్షల మంది విద్యార్థులు లబ్ధిపొందనున్నారు. రాష్ట్రంలో విద్యా ప్రమాణాలు పెంచి విద్యార్థులకు ఉన్నత విద్య అందించేందుకు వీలుగా ప్రభుత్వం అనేక రకాల చర్యలను చేపడుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేలా పలు ప్రోత్సాహకాలను ఉచితంగా అందజేస్తోంది. ఈ క్రమంలోనే విద్యార్థినుల కోసం 'పుదిమై పెణ్' పథకాన్ని ప్రవేశపెట్టి నెలకు రూ.1000 ఆర్థిక సాయం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ పథకం కింద ఇప్పటికే 3 లక్షల మందికి పైగా విద్యార్థినులు లబ్ధి పొందుతున్నారు. ఇపుడు విద్యార్థులకు కూడా ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద, మధ్యతరగతి విద్యార్థుల కోసం ఈ పథకాన్ని ప్రవేశపెట్టి, వారిని విద్యారంగంలో విజేతలుగా నిలిపేందుకు ఈ పథకం ఎంతగానో దోహదపడుతుందని ప్రభుత్వ పేర్కొంది. ఈ పథకం కింద 3.28 లక్షల మంది విద్యార్థులు లబ్ధి పొందనున్నారు. ఈ కార్యక్రమం అనంతరం కోయంబత్తూరు నగరంలో చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేస్తారు. అలాగే, పూర్తి చేసిన అనేక అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. ఆ తర్వాత కన్నియూరులో ఏర్పాటుచేసిన ఎనిమిదడుగుల మాజీ ముఖ్యమంత్రి దివంగత కరుణానిధి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. ఈ పర్యటనలో ముఖ్యమంత్రి స్టాలిన్ వెంట పలువురు మంత్రులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొంటారు. సీఎం పర్యటనను పురస్కరించుకుని కోవై నగరంలో భద్రత కట్టుదిట్టం చేశారు.

రెండో దశ పర్యటనకు శశికళ సిద్ధం



● 18న ప్రజా సంక్షేమాల పంపిణీకి చర్యలు

అడయార్, ఆగస్టు 8: అన్నాడీఎంకే బహిష్కృత నేత శశికళ తన రెండో దశ రాష్ట్ర పర్యటనకు సిద్ధమవుతున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఈ నెల 18వ తేదీన తన పుట్టిన రోజు సందర్భంగా పేదలకు వివిధ రకాల సంక్షేమ సహాయాలను పంపిణీ చేయనున్నారు. ఈ నెల 14వ తేదీ నుంచి 18వ తేదీ వరకు ఆమె తిరునెల్వేలి జిల్లాలో పర్యటించనున్నారు. దీని కోసం ఆమె ఈ నెల 13న చెన్నై నుంచి నెల్లైకు బయలుదేరి వెళతారు. ఈ పర్యటనలో ఆమె తన మద్దతుదారులతో ఆమె సమావేశమై వివిధ అంశాలపై చర్చిస్తారు. అదేవిధంగా 18వ తేదీన తన పుట్టిన రోజును పురస్కరించుకుని పేదలకు సంక్షేమ సహాయాలను అందజేస్తారు. అలాగే, ఆమె అనుచరులు, మద్దతుదారులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, ఆస్పత్రుల్లో రక్తదానం చేసేలా ప్లాన్ చేశారు. శశికళ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను ఆమె అనుచరులు చేస్తున్నారు.



రామనాథపురం అరుళ్‌మిగు రామనాథస్వామి ఆలయ ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న ఉత్సవమూర్తులు





కార్యక్రమంలో ప్రసంగిస్తున్న సీఎం

జాతి, కులమతాలకతీతంగా సాంస్కృతికోత్సవాలు

● 'మా మదురై'ని ప్రారంభించిన సీఎం స్టాలిన్

చెన్నై, ఆగస్టు 8: జాతి, కులమతాలకు అతీతంగా సాంస్కృతికోత్సవాలను జరుపుకోవాలని ముఖ్యమంత్రి స్టాలిన్ రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు. మదురై నగర వారసత్వాన్ని, సంస్కృతిని జ్ఞప్తికి తెచ్చేలా నిర్వహించే 'మా మదురై' వేడుకలు మదురై సిట్టింగ్ ఎంపీ వెంకటేశన్ ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. వీటిని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాండ్య రాజులు పరిపాలనా కేంద్రంగా విరాజిల్లిన మదురై నగరం... తప్పు చేసిన వారు రాజే అయినప్పటికీ.. తప్పును ఎత్తిచూపిన భూమి మదురై గడ్డ అని గుర్తు చేశారు. న్యాయాన్ని కాపాడేందుకు ప్రాణాలనే తృణప్రాయంగా అర్పించిన రాజు పాలించిన స్థలమన్నారు. తిరుమలై నాయకర్, రాణి మంగమ్మ పరిపాలనచేసిన గడ్డ, ప్రపంచ ప్రసిద్ధిగాంచిన సుందరేశ్వరాలయం ఉన్న ఆధ్యాత్మిక నగరం మదురై అని పేర్కొన్నారు. ఎంతో గుర్తింపు పొందిన చిత్తిరై తిరువిళ అతిపెద్ద సాంస్కృతిక పండుగగా జరుపుకుంటారని, 1866లోనే మున్సిపాలిటీగా ఉన్న మదురైని 1971లో నాటి ముఖ్యమంత్రి కరుణానిధి చెన్నై కార్పొరేషన్ తర్వాత రాష్ట్రంలో రెండో కార్పొరేషన్‌గా ప్రకటించారని గుర్తు చేశారు. జాతిపిత మహాత్మా గాంధీ తనను తాను అర్ధనగ్నంగా మార్చుకున్న ప్రాంతమన్నారు. ముఖ్యంగా తన జీవితాన్ని కీలక మలుపు తిప్పిన యువజన మహానాడును నిర్వహించింది కూడా ఇక్కడేనన్నారు. అలాంటి నగరంలో 'మా మదురై' వేడుకలను ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రధానంగా మన సంస్కృతీ సంప్రదయాలకు ప్రతిరూపాలైన కల్చరల్ ఈవెంట్స్‌ను ప్రతి ఒక్కరూ జాతి, కులమతాలకు అతీతంగా జరుపుకోవాలని సీఎం స్టాలిన్ పిలుపునిచ్చారు. కాగా, మా మదురై ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు మూర్తి, పళనివేల్, త్యాగరాజన్, మదురై మేయర్ ఇంద్రాణి, కలెక్టర్ సంగీత, ఎమ్మెల్యే దళపతి తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ ప్రశ్నలకు సమాధానమేదీ?

● టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై



సెంట్రల్ చెన్నై కాంగ్రెస్ కార్యనిర్వాహకుల సమావేశంలో సెల్వపెరుందగై, తిరునావుక్కరసు, తంగబాలు తదితరులు

ప్యారీస్, ఆగస్టు 8: దేశంలో తిష్టవేసిన ప్రజా సమస్యల పరిష్కారం గురించి లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పార్లమెంటులో అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పగలిగిన నాయకులు లేరని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షుడు సెల్వపెరుందగై పేర్కొన్నారు. ఎగ్మూర్‌లో సెంట్రల్ చెన్నై పశ్చిమ జిల్లా కాంగ్రెస్ కార్యనిర్వాహకుల సమావేశం సెల్వపెరుందగై అధ్యక్షతన గురువారం జరిగింది. అరుంబాక్కం వీరపాండ్యన్, పి.సురేష్‌బాబు, జాన్సన్ తదితరుల పర్యవేక్షణలో జరిగిన ఈ సమావేశంలో టీఎన్‌సీసీ మాజీ అధ్యక్షులు ఎస్.తిరునావుక్కరసు, కేవీ తంగబాలు, మాజీ ఎంపీలు జేఎం హారోన్, పీటర్ అల్ఫోన్స్, ఎస్సీ విభాగం అధ్యక్షుడు ఎంపీ రంజన్‌కుమార్, మాజీ జిల్లా అధ్యక్షులు రంగభాష్యం, ఏలుమలై తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో సెల్వపెరుందగై మాట్లాడుతూ... ఇండియా కూటమి దేశాన్ని కాపాడేందుకే ఏర్పడిందని, భారత రాజ్యాంగాన్ని పరిరక్షిస్తోందని, కూటమిలోని పార్టీల మధ్య ఎలాంటి పొరపొచ్చాలు లేకుండా ముందుకు సాగుతున్నారని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ 18వ లోక్‌సభ ఎన్నికల్లో 400 స్థానాలను కైవసం చేసుకొని మెజార్టీ పాలన తీసుకొస్తారని ఎన్డీఏ కూటమి నేతలు భావించారని అయితే, ఈ ఎన్నికల్లో ఇండియా కూటమి ఎవ్వరూ ఊహించని విధంగా గతంలో కంటే అధిక సీట్లు సాధించిందన్నారు. రాహుల్ గాంధీ ప్రతిపక్షనేతగా బాధ్యతలు స్వీకరించి ఆదర్శ నేతగా వ్యవహరిస్తున్నారని, పార్లమెంటులో ఆయన అడిగే ప్రశ్నలకు సరైన సమాధానం చెప్పగలిగే నాయకులు లేరని వ్యాఖ్యానించారు. లోక్‌సభలో ప్రస్తుతం 101గా ఉన్న ఎంపీల సంఖ్య రాబోయే ఎన్నికల్లో 275కు పెరగాలంటే ఇప్పటి నుంచే కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర కాంగ్రెస్‌లో పెద్దసంఖ్యలో యువతను చేర్చుకోనేందుకు జిల్లా నిర్వాహకులు కృషిచేయాల్సిన అవసరం ఉందని సెల్వపెరుందగై సూచించారు.

ఒలింపిక్స్ పోటీలకు పారిస్ వెళ్లిన మంత్రి ఉదయనిధి



పెరంబూర్, ఆగస్టు 8: ప్యారీస్‌లో జరుగుతున్న ఒలింపిక్స్‌లో రాష్ట్రం తరపున పాల్గొంటున్న క్రీడాకారులను ప్రోత్సహించేందుకు యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధిశాఖ మంత్రి ఉదయనిధి బుధవారం రాత్రి విమానంలో పారిస్ వెళ్లారు. ఆయన వెంట క్రీడల శాఖ కార్యదర్శి అతుల్యా మిశ్రా, కమిటీ సభ్యుల కార్యదర్శి మేఘనాథ రెడ్డి తదితరులున్నారు. 33వ ఒలింపిక్ పోటీలు ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో జరుగుతున్నాయి. ఈ పోటీల్లో 206 దేశాలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటున్నారు. ఈ పోటీల్లో భారత్ తరఫున 117 మంది క్రీడాకారులు పాల్గొంటుండగా, పంజాబ్, హరియాణా రాష్ట్రాల తర్వాత ఎక్కువ మంది క్రీడాకారులు తమిళనాడుకు చెందినవారున్నారు. రాష్ట్రం తరపున 11 మంది పురుషులు, మహిళా క్రీడాకారులు, ఆరుగురు దివ్యాంగులు కలిపి మొత్తం 17 మంది ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ 17 మందికి సీఎం ఉత్తర్వుల మేరకు తలా రూ.7 లక్షల చొప్పున రూ.1.19 కోట్లు మంత్రి ఉదయనిధి అందజేశారు. ఈ నేపథ్యంలో, రాష్ట్రం నుంచి పాల్గొంటున్న క్రీడాకారులను స్వయంగా ఉత్సాహపరిచేలా మంత్రి ఉదయనిధి పారిస్ వెళ్లారు. అక్కడ ఆరు రోజులు బస చేయనున్న మంత్రి, ఈ నెల 14న నగరానికి వస్తారని సమాచారం.

సమాచార దర్శిని

రేపు రేషన్ గ్రీవెన్స్

ఐసిఎఫ్, ఆగస్టు 8: నగరంలోని ఆహార వస్తువుల సరఫరా, వినియోగదారుల భద్రత శాఖ 19 మండల సహాయ కమిషనర్ కార్యాలయాల్లో శనివారం రేషన్ గ్రీవెన్స్ జరుగనుంది. ప్రతినెలా రాష్ట్రవ్యాప్తంగా ఈ గ్రీవెన్స్ జరుగుతోంది. ఆ ప్రకారం, ఈ నెల గ్రీవెన్స్‌లో కొత్త రేషన్‌కార్డుల దరఖాస్తు స్వీకరణ, పేర్లు, చిరునామా మార్పులు, మొబైల్ నెంబర్ల నమోదు, రేషన్ దుకాణాల సేవలపై ఫిర్యాదు చేసి పరిష్కారం పొందవచ్చు.

ఎల్ఐసీ నుంచి నాలుగు కొత్త పథకాలు

ఐసిఎఫ్, ఆగస్టు 8: ఎల్ఐసీ సంస్థ నాలుగు కొత్త పథకాలు పరిచయం చేసింది. గృహ, వాహన, విద్యా రుణాలు వంటి వివిధ రుణాలు పొందే వారు తమ కాలం తీరిన అనంతరం కుటుంబ సభ్యులకు ఆ రుణం తిరిగి చెల్లించేలా ఈ పథకాలను పరిచయం చేసినట్లు ఎల్ఐసి ప్రధాన అధికారి సిద్ధార్థ్ తెలిపారు. యువ టర్మ్, డీజీ టర్మ్, యువ క్రెడిట్ లైఫ్, డీజీ క్రెడిట్ లైఫ్ అనే ఈ నాలుగు పథకాల్లో 18 నుంచి 45 ఏళ్లలోపున్న వారు ఖాతా ప్రారంభించవచ్చు. ఈ పథకాల్లో గరిష్ట వయో పరిమితి 75గా ఉంది. కనిష్ట బీమా ప్రీమియం రూ.50 లక్షలు, గరిష్టంగా రూ.5 కోట్లు నిర్ణయించారు. వివరాలకు ఎల్ఐసీ వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

రాష్ట్రవ్యాప్తంగా 100 'అముదం' స్టోర్స్

పెరంబూర్, ఆగస్టు 8: రాష్ట్రవ్యాప్తంగా 100 కొత్త అముదం దుకాణాలను ప్రారంభించనున్నట్లు ఆహార సరఫరా శాఖ తెలియజేసింది. డిపార్ట్‌మెంటల్ స్టోర్ పోటీ తట్టుకొనేలా, ప్రజలకు సులభంగా తక్కువ ధరకు నాణ్యమైన కిరాణా సరుకులు, కూరగాయలు, పండ్లు విక్రయించేలా ఆహార సరఫరా శాఖ అముదం స్టోర్స్ ఏర్పాటుచేసింది. ఈ దుకాణాలకు ప్రజల నుంచి ఆదరణ లభించడంతో మరో వంద దుకాణాలు ప్రారంభించాలని నిర్ణయించింది. సెల్ఫ్ సర్వీస్ ద్వారా నడిచే ఈ దుకాణాలకు అముదం అని పేరు పెట్టిన విషయం తెలిసిందే.

చెన్నై-లండన్ విమాన సేవల రద్దు

పెరంబూర్, ఆగస్టు 8: నగరం నుంచి లండన్‌కు బయల్దేరాల్సిన బ్రిటీష్ ఎయిర్‌లైన్స్ విమానం హఠాత్తుగా రద్దు కావడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. లండన్ నుంచి బుధవారం రాత్రి చెన్నైకి బయల్దేరిన బ్రిటీష్ ఎయిర్‌లైన్స్ విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో, ఆ విమానాన్ని తిరిగి లండన్‌కు మళ్లించారు. చెన్నై నుంచి ఈ విమానంలో వెళ్లేందుకు సుమారు 210 మంది వేచి ఉండగా, లండన్ నుంచి విమానం రాని కారణంగా రద్దు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. కొందరు ప్రయాణికులు ఇతర విమానాల్లో వెళ్లగా, మిగిలిన వారికి స్టార్ హోటల్స్‌లో బస ఏర్పాటు చేసిన అధికారులు, గురువారం వేకువజామున వారిని బ్రిటీష్ ఎయిర్‌లైన్స్ విమానంలో లండన్ పంపించారు.

16న నెల్లై-చెన్నై వందే భారత్ రైలు రద్దు

ఐసిఎఫ్, ఆగస్టు 8: స్థానిక తాంబరం రైల్వే యార్డులో పర్యవేక్షణ పనుల కారణంగా తిరునల్వేలి-చెన్నై వందే భారత్ రైలు సేవలు ఈనెల 16వ తేది రద్దు కానున్నాయి. జూలై 23 నుంచి ఈ నెల 18వ తేది వరకు కొన్ని రైళ్లను పాక్షికంగా, కొన్ని రైళ్లు పూర్తిగా రద్దు చేశారు. 16వ తేది తిరునల్వేలి నుంచి చెన్నై ఎగ్మూర్ మధ్య నడిచే వందే భారత్ రైలు రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు.

రాష్ట్రంలో 67 శాతం అదనపు వర్షపాతం

పెరంబూర్, ఆగస్టు 8: రాష్ట్రంలో నైరుతి రుతుపవనాల ప్రభావంతో 67 శాతం అధిక వర్షపాతం నమోదైందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలియజేసింది. రుతుపవనాలు ప్రారంభమైన జూన్ 1 నుంచి ఈ నెల 8వ తేది వరకు 137.7 మి.మీ వర్షపాతం నమోదు కావలసి ఉండగా, ఈ ఏడాది 67 శాతం అధికంగా 230.2 మి.మీ నమోదైందని అధికారులు తెలిపారు.

నేడు, రేపు ప్రత్యేక బస్సులు

ఐసిఎఫ్, ఆగస్టు 8: వారాంతపు సెలవులను పురస్కరించుకొని శుక్ర, శని వారాల్లో ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు రవాణా శాఖ తెలిపింది. నగరం నుంచి ఇతర ప్రాంతాలకు, అక్కడి నుంచి నగరానికి ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు నడుపుతున్న విషయం తెలిసిందే. కిలంబాక్కం బస్ టెర్మినల్ నుంచి తిరువణ్ణామలై, తిరుచ్చి, కన్నియాకుమారి వంటి ప్రాంతాలకు శుక్రవారం 275 బస్సులు, శనివారం 315 బస్సులు నడుపనున్నారు. కోయంబేడు బస్ టెర్మినల్ నుంచి హోసూరు, నాగపట్టణం, వేలాంకన్ని, బెంగళూరు ప్రాంతాలకు శుక్ర, శనివారాల్లో తలా 55 బస్సులు నడుపనున్నారు. అలాగే, బెంగళూరు, తిరుప్పూర్, కోవై నుంచి పలు ప్రాంతాలకు 200ప్రత్యేకబస్సులు నడుపనున్నారు. మాధవరం నుంచి శుక్ర, శనివారాల్లో తలా 20 బస్సులు, ఆదివారం రోజున నగరం నుంచి ఇతర ప్రాంతాలకు, అక్కడి నుంచి నగరాలకు ప్రయాణికుల రద్దీని బట్టి బస్సులు నడుపనున్నట్లు రవాణా శాఖ అధికారులు తెలిపారు.

15న పంచాయతీల్లో గ్రామ సభలు

పెరంబూర్, ఆగస్టు 8: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ నెల 15వ తేది అన్ని పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించేందుకు ప్రభుత్వం అనుమతించింది. రాష్ట్రంలో ప్రతి ఏడాది ఆరు గ్రామ సభలు నిర్వహిస్తున్నారు. ఆ ప్రకారం, గణతంత్ర దినోత్సవం (జనవరి 26), ప్రపంచ నీటి దినోత్సవం (మార్చి 22), కార్మిక దినోత్సవం (మే 1), స్వాతంత్ర్య దినోత్సవం (ఆగస్టు 15), గాంధీ జయంతి (అక్టోబరు 2), స్థానిక సంస్థల దినోత్సవం (నవంబరు 1) తదితర రోజుల్లో నిర్వహించే గ్రామసభల్లో, పంచాయతీ పరిధిలో చేపట్టిన, చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, నెలకొన్న సమస్యలపై చర్చిస్తుంటారు. లోక్‌సభ ఎన్నికల నిబంధనలతో మే 1వ తేది గ్రామ సభలు నిర్వహించలేదు.ఈనేపథ్యంలో, స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈనెల 15వ తేది ఉదయం 11 గంటలకు గ్రామసభలు నిర్వహణకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ సభల గురించి ప్రజలకు అవగాహన కల్పించి, అందరూ సభలో పాల్గొనేలా చర్యలు చేపట్టాలని రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

కులగణనపై మంత్రివర్గం నిర్ణయం తీసుకోవాలి

● డాక్టర్ రాందాస్ విన్నపం

అడయార్, ఆగస్టు 8: రాష్ట్రంలో కులగణన చేపట్టే అంశంపై ఈ నెల 13న జరిగే మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోవాలని పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ కోరారు. ఈ విషయంపై ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వన్నియర్లకు రిజర్వేషన్లు కేటాయించే అంశంలో ద్రోహం చేస్తే ఆ వర్గానికి చెందిన ప్రజలు ఏమాత్రం క్షమించరన్నారు. వన్నియర్లకు రిజర్వేషన్లు ఇవ్వకూడదన్న నిర్ణయంతోనే డీఎంకే ప్రభుత్వం ఉన్నట్టుగా వార్తలు వస్తున్నాయన్నారు. రాష్ట్రంలో కులాల వారీగా జనాభా లెక్కలు చేపట్టాలన్నారు. కులగణనచేపట్టే అధికారం పూర్తిగా రాష్ట్రాలకే ఉందన్నారు. ఈ విషయాన్ని సుప్రీంకోర్టుతో పాటు పాట్నా హైకోర్టు స్పష్టం చేశాయన్నారు. అందువల్ల ఈ నెల 13వ తేదీన జరుగనున్న మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు.

48వ వసంతంలోకి తమిళనాడు ఎక్స్‌ప్రెస్



వేడుకల్లో రైల్వే అధికారులు, సిబ్బంది, ప్రయాణికులు

పెరంబూర్, ఆగస్టు 8: చెన్నై సెంట్రల్-న్యూ ఢిల్లీ-చెన్నై సెంట్రల్ (నెం.12621/22) తమిళనాడు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు బుధవారం 48వ వసంతంలోకి అడుగిడింది. 1976లో ప్రారంభమైన ఈ రైలు 10 రైల్వే స్టేషన్ల మీదుగా 2,182 కి.మీ ప్రయాణం చేస్తుంది. బుధవారం రాత్రి 11 గంటలకు చెన్నై సెంట్రల్ నుంచి బయల్దేరే తమిళనాడు సూపర్ ఫాస్ట్ రైలు వద్ద చెన్నై డివిజన్ అధికారులు, సిబ్బంది, ప్రయాణికులు కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. ప్రయాణికుల భద్రత, సురక్షితమైన ప్రయాణం తదితరాల కారణంగా తమిళనాడు ఎక్స్‌ప్రెస్ విజయవంతంగా 47 వసంతాలు పూర్తిచేసుకుందని అధికారులు తెలిపారు.

ఆలయ వేడుకల్లో వినోద ఉత్సవం

పెరంబూర్, ఆగస్టు 8: దిండుగల్ ముత్తలక్కుపట్టిలోని సెయింట్ సెబాస్టియన్ ప్రార్థనాలయంలో పిల్లలను వేలం వేసే వినోద ఉత్సవం జరిగింది. 350 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ఆలయంలో ఉత్సవాలు ఈ నెల 4న పతాకావిష్కరణతో ప్రారంభమయ్యాయి. ప్రార్థనా మందిరానికి వచ్చే భక్తులు తమ కోర్కెలు తీరితే మొక్కులు చెల్లిస్తామని ప్రార్థిస్తుంటారు. ఆ ప్రకారం, కోర్కెలు తీరిన భక్తులు అందించిన కోళ్లు, మేకలు, గొర్రెలతో విందు భోజనం వేడుకలు రెండు రోజుల క్రితం జరిగాయి. మరుసటిరోజు పిల్లలను వేలం వేసే వినోద వేడుకలు నిర్వహించారు. ముఖ్యంగా, సంతానం కోసం, పిల్లల ఆరోగ్యం బాగుండాలని కోరుకునే తల్లిదండ్రులు, కోర్కెలు తీరితే తమ పిల్లలను వేలం వేస్తామని మొక్కుంటారు. కోర్కెలు తీరితే ఆలయ వేడుకల్లో పిల్లలను వేలం వేస్తుంటారు. బంధువులు, స్నేహితులు పిల్లలను వేలంలో కొనుగోలు చేసి మళ్లీ తల్లిదండ్రులకు అప్పగిస్తుంటారు. వేలంలో వచ్చిన సొమ్మును తల్లిదండ్రులు ప్రార్థనాలయానికి కానుకగా సమర్పిస్తుంటారు. ఈ వేడుకల్లో దిండుగల్, మదురై, కోయంబత్తూర్, తూత్తుకుడి సహా పలు జిల్లాలకు చెందిన తల్లిదండ్రులు తమ పిల్లలను వేలం వేశారు.



పిల్లలను వేలం వేస్తున్న దృశ్యం

కనువిందు చేస్తున్న 'బ్రహ్మ కమలం'



పెరంబూర్, ఆగస్టు 8: తిరుపత్తూర్‌లో ఏడాదికి ఒకసారి పూసే బ్రహ్మ కమలం విరబూసింది. తిరుపత్తూర్ మున్సిపాలిటీ పరిధిలోని పూంగావనత్తమ్మన్ ఆలయ వీధికి చెందిన అన్బు తన ఇంట్లో తమల పాకులు సహా పలు రకాల పూల చెట్లు పెంచుతున్నాడు. వాటిలో బ్రహ్మ కమలం మొక్కలు కూడా ఉన్నాయి. ఈ పూవు ఏడాదికి ఒకసారి మాత్రమే ఆడి మాసంలో రాత్రి వేళ వికసిస్తుంది. ఆ ప్రకారం, అన్బు ఇంట్లో పెంచుతున్న బ్రహ్మ కమలం మొక్కకు సుమారు 10 పూలు మంగళవారం రాత్రి వికసించాయి. ఆడి మాసంలో వికసించే ఆ పూలను ఆశ్చర్యంగా చూస్తున్న ఆ ప్రాంత ప్రజలు, బ్రహ్మ కమలం పుష్పానికి పూజలు చేస్తున్నారు.

జాలరి వలలో భారీ 'మయిల్' చేప



మయిల్ చేపతో జాలరి

పెరంబూర్, ఆగస్టు 8: నాటు పడవతో వెళ్లిన జాలరి వలలో భారీ మయిల్ చేప చిక్కింది. చేపల్లో అత్యంత వేగంతో వెళ్లే మయిల్ చేప గంటకు 100 కి.మీ నుంచి 110 కి.మీ వరకు ఈదగలదు. పొడవైన ముక్కు ఆకారం కలిగిన ఈ చేప, ఆ ముక్కుతో దాడిచేస్తుంది. లోతైన సముద్రపు వెచ్చని నీటిలో కనిపించే ఈ చేపలు ఎక్కువగా పాక్ జలసంధి ప్రాంతంలో సంచరిస్తుంటాయి. ఈ నేపథ్యంలో, పాంబన్ ఉత్తర తీరంలో బుధవారం చేపల వేటకు వెళ్లిన ఓ జాలరి వలలో ఈ చేప చిక్కింది. సుమారు 6 అడుగుల పొడవు, 50 కిలోల బరువున్న ఈ చేప రూ.6 వేలకు విక్రయమైంది.

భవన నిర్మాణ వ్యర్థాలు వేస్తే జరిమానా

పెరంబూర్, ఆగస్టు 8: నగరంలో నదీ తీరాలు, బహిరంగ ప్రాంతాల్లో భవన నిర్మాణ వ్యర్థాలు వేసిన వారికి రూ.5,000 జరిమానా విధిస్తామని గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) హెచ్చరించింది. బహిరంగ ప్రాంతాల్లో వేసే భవన నిర్మాణ వ్యర్థాలతో ప్రజలు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతుండగా, వర్షాలు కురిసిన సమయంలో ఆ ప్రాంతాలు బురదమయంగా మారుతున్నాయి. గత 10 రోజులుగా రాత్రి వేళల్లో పారిశుధ్య కార్మికులు జీసీసీ పరిధిలోని 15 మండలాల్లో రోడ్ల పక్కనున్న సుమారు 6,310 టన్నుల నిర్మాణ వ్యర్థాలు తొలగించారు. ఈ నేపథ్యంలో, అనుమతించిన ప్రాంతాలు మినహా నదీ తీరాలు, బహిరంగ ప్రాంతాల్లో భవన నిర్మాణ వ్యర్థాలు వేసిన వారికి రూ.500 నుంచి రూ.5,000 వరకు జరిమానా విధిస్తామని కార్పొరేషన్ హెచ్చరించింది.

గ్రామసభలో మద్యనిషేధంపై తీర్మానం

● పీఎంకే అధ్యక్షుడు డా.అన్బుమణి

పెరంబూర్, ఆగస్టు 8: గ్రామసభల్లో మద్యనిషేధం అమలుచేయాలనే తీర్మానాలు చేయాలని పీఎంకే అధ్యక్షుడు డా.అన్బుమణి ప్రజలను పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... మద్యానికి అనేక కుటుంబాలు బలవుతున్నాయన్నారు. రద్దీ ప్రాంతాల్లో మద్యం దుకాణాల వల్ల ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. మద్యానికి బానిసైన అనేక మంది అనారోగ్యానికి గురికావడం, మృతిచెందడంతో పలు కుటుంబాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయన్నారు.ఈనెల 15న జరుగనున్న గ్రామ సభల్లో మద్య నిషేధంపై తీర్మానం చేసి రాష్ట్రప్రభుత్వానికి కనువిప్పు కలిగించాలని డా.అన్బుమణి విజ్ఞప్తి చేశారు.

కుక్కతో వాకింగ్... రూ.50వేల జరిమానా

● తాంబరం కార్పొరేషన్ చర్యలు

ప్యారీస్, ఆగస్టు 8: లైసెన్స్ లేకుండా పెంచుకుంటున్న జర్మన్ షెపర్డ్ డాగ్‌తో వాకింగ్ వెళ్లిన యజమానికి తాంబరం కార్పొరేషన్ రూ.50,000 జరిమానా విధించింది. ఇళ్లలో పెంచుకుంటున్న ప్రాణులకు లైసెన్స్ తప్పనిసరి చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. గ్రేటర్ చెన్నైలో ఈ ఉత్తర్వులు అమలులో ఉన్న నేపథ్యంలో, తాంబరం కార్పొరేషన్ పరిధిలో ఈనెల 15వ తేది వరకు లైసెన్స్ పొందేందుకు గడువు పొడిగించారు. ఇదిలా ఉండగా, తాంబరం తిరువేంగడం నగర్‌కు చెందిన ఓ వ్యక్తి జర్మన్ షెపర్డ్ కుక్కతో వాకింగ్ వెళ్లడంపై స్థానికులు కార్పొరేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో, విచారణ జరిపిన అధికారులు, ఆ శునకం యజమానికి జరిమానా విధించారు.

తండ్రిని హతమార్చిన కుమారుడి అరెస్ట్

ప్యారీస్, ఆగస్టు 8: తల్లిని మందలించిన తండ్రిని కర్రతో కొట్టి చంపిన కుమారుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక ఎర్నావూర్ ఆదిద్రావిడ కాలనీకి చెందిన వీరయ్య(65) మనలి పుదునగర్‌లోని ప్రైవేటుపాఠశాలలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు.. ఆయనకు నాగమ్మాళ్ అనే భార్య, ముగ్గురు కుమారులున్నారు. సెల్‌ఫోన్‌దుకాణంలో పనిచేస్తున్న వీరయ్య కుమారుడు రాజేష్, బుధవారం రాత్రి కుటుంబసభ్యులతో కలసి భోజనం చేస్తున్న సమయంలో మద్యం మత్తులో ఉన్న తండ్రి తన తల్లిని దూషించడం సహించలేని రాజేష్, కర్రతో తండ్రి తలపై కొట్టడంతో, ఆయన మృతిచెందాడు. దీనిపై కేసు నమోదుచేసిన పోలీసులు, రాజేష్‌ను గురువారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఐసిఎఫ్, ఆగస్టు 8: విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

చేపాక్కం: ట్రిప్లికేన్, టీవీ స్టేషన్, ప్రజాపనుల శాఖ కార్యాలయం, ప్రెసిడెన్సీ కళాశాల, పెద్ద వీధి, సైడోజి వీధి, ట్రిప్లికేన్ హైరోడ్డు, అయ్యా పిళ్లై వీధి, రంగనాథన్ వీధి, బెల్స్ రోడ్డు, సీఎన్కే రోడ్డు, ఎళిలగం, మద్రాసు విశ్వవిద్యాలయం, వాలాజా రోడ్డు, ఎంఏసీ స్టేడియం, మియాన్ సాహెబ్ వీధి, సుబ్రమణ్య చెట్టి వీధి, ట్రైబూన్ అలిఖాన్ వీధి, యూసఫ్ లబ్బై వీధి, అబ్దుల్ కరీం వీధి, హబీబుల్లా 1 నుంచి 4 వీధులు, పకీర్‌సాహెబ్ వీధి, పులిపోన్ బజార్, సారధి వీధి.

షోలింగనల్లూర్: ఎల్కాట్ అవెన్యూ, క్లాసిక్ ఫార్మ్‌శ్ 1 నుంచి 10 వీధులు, కుమారస్వామి నగర్.

కొట్టివాక్కం: జర్నలిస్ట్ కాలనీ, శ్రీనివాసపురం, కొత్త బీచ్ రోడ్డు, కావేరి నగర్ 1 నుంచి 6 వీధులు, కర్పగాంబాల్ నగర్, లక్ష్మణ పెరుమాళ్ నగర్, తిరువళ్లువర్ నగర్ 1 నుంచి 59 వీధులు, భక్తసింగ్ రోడ్డు, వెంకటేశ్వర నగర్ 1 నుంచి 21 వీధులు, న్యూ కాలనీ 1 నుంచి 21 వీధులు, కొట్టివాక్కం వీధి నుంచి కుప్పం వరకు, భజన ఆలయ వీధి, ఈసీఆర్ మెయిన్ రోడ్డు (మరుందీశ్వర ఆలయం నుంచి నీలాంగరై కుప్పం వరకు), వర్శిటీ నగర్, శాస్త్రి నగర్ ఈస్ట్, నార్త్, సౌత్ మాడవీధులు, పిల్లయార్ ఆలయ వీధి, రంగస్వామి అవెన్యూ, బీచ్ వే రోడ్డు, బాలకృష్ణ హైరోడ్డు, వాల్మీకి నగర్, కళాక్షేత్ర రోడ్డు, సీజీఐ కాలని, పోలీస్ క్వార్టర్స్, తిరువీధిఅమ్మన్ ఆలయ వీధి, పాలవాక్కం సంఘం కాలని, కామరాజర్ రోడ్డు, వీజీపీ లే ఔట్, అన్నాసాలై, కందస్వామి నగర్.

రాష్ట్రవ్యాప్తంగా పోలీసు అధికారుల బదిలీ

చెన్నై, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 24 మంది ఐపీఎస్ అధికారులను రాష్ట్రప్రభుత్వం బదిలీ చేసింది. ఆ మేరకు హోంశాఖ కార్యదర్శి ఉత్తర్వులు జారీచేశారు. బదిలీ అయిన అధికారుల వివరాలు..

- సేలం సౌత్ డిప్యూటీ కమిషనర్ మదివానన్ వేలూరు జిల్లా ఎస్పీగా నియామకం.
- కరూర్ జిల్లా ఎస్పీ ప్రభాకరన్ తిరువణ్ణామలై జిల్లా ఎస్పీగా
- తిరువణ్ణామలై జిల్లా ఎస్పీ కార్తికేయన్ కోవై జిల్లా ఎస్పీగా.
- తిరునల్వేలి ఈస్ట్ డిప్యూటీ కమిషనర్ ఆదర్శ్ బచేరా పెరంబలూరు జిల్లా ఎస్పీగా.
- సేలం జిల్లా ఎస్పీ అరుణ్ కపిలన్ నాగపట్టణం జిల్లా ఎస్పీగా.
- విరుదు నగర్ జిల్లా ఎస్పీ ఫెరోజ్‌ఖాన్ కరూర్ జిల్లా ఎస్పీగా .
- తిరుపత్తూర్ జిల్లా ఎస్పీ అల్బర్ట్ జాన్ తూత్తుకుడి జిల్లా ఎస్పీగా.
- ట్రిప్లికేన్ డిప్యూటీ కమిషనర్‌గా సెల్వ నాగరత్నం నియామకం.
- తిరుపత్తూర్ జిల్లా ఎస్పీగా శ్రేయా గుప్తా.
- సేలం జిల్లా ఎస్పీగా గౌతం గోయల్ .
- విరుదునగర్ జిల్లా ఎస్పీగా కన్నన్.
- మైలాడుదురై జిల్లా ఎస్పీగా స్టాలిన్ .
- ధర్మపురి జిల్లా ఎస్పీగా మహేశ్వరన్ .
- చెన్నై అన్నానగర్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసన్ తెన్‌కాశి జిల్లా ఎస్పీగా నియమించారు. వీరితో సహా మరో మొత్తం 56 మందిని బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

అడ్మిషన్లపై ఫోన్ కాల్స్ నమ్మొద్దు

● సాంకేతిక విద్య కమిషనర్ అబ్రహం

ప్యారీస్, ఆగస్టు 8: ఇంజనీరింగ్ కోర్సుల్లో అడ్మిషన్లకు సంబంధించి అనధికారికంగా వచ్చే ఫోన్ కాల్స్‌ను నమ్మొద్దని సాంకేతిక విద్యా విభాగం కమిషనర్ అబ్రహం హెచ్చరించారు. నగరంలో ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ... 2024-25వ విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంజనీరింగ్ కోర్సులో అడ్మిషన్లకు సంబంధించి సంఘ విద్రోహులు కొందరు విద్యార్థుల సెల్‌ఫోన్లకు నెంబర్లు విడుదల చేశారని, దీనిపై విచారణ జరిపి సైబర్ క్రైం ద్వారా చర్యలు చేపడతామని తెలిపారు. ఇంజనీరింగ్ అడ్మిషన్లకు సంబంధించి అధికారికంగా ఎలాంటి సమాచారం బయటకు రాలేదని, ఒకవేళ విద్యార్థుల సెల్‌ఫోన్లకు అడ్మిషన్లకు సంబంధించిన కాల్స్ వస్తే వెంటనే సమీపంలోని టీఎఫ్‌సీ కేంద్రంలో ఫిర్యాదు చేయవచ్చన్నారు. అంతేకాకుండా 1800 425 0110 అనే టోల్‌ఫ్రీ నెంబరులో ఫిర్యాదు చేయవచ్చని ఆయన తెలిపారు.

టీచర్ల కోసం విద్యార్థుల రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

పెరంబూర్, ఆగస్టు 8: ఉపాధ్యాయులను నియమించాలంటూ విద్యార్థులు రాస్తారోకో చేపట్టిన ఘటన తిరువళ్లూర్ జిల్లాలో గురువారం చోటుచేసుకుంది. పొన్నేరి సమీపం అన్నామలైచేరి ప్రాంతంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాలలు ఒకేచోట ఉన్నాయి. ఈ పాఠశాలల్లో సుమారు 300 మంది విద్యార్థినీ, విద్యార్థులు చదువుతున్నారు. మొత్తం 16 మంది ఉపాధ్యాయులుండగా, బదిలీలు, పదవీ విరమణ తదితర కారణాలతో ఉపాధ్యాయుల సంఖ్య తగ్గి కొత్తవారిని నియమించలేదని సమాచారం. ప్రస్తుతం ప్రాథమిక పాఠశాలలో ఒకరు, ఉన్నత పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు. ఉపాధ్యాయుల కొరతతో బోధన స్తంభించింది. ఈ నేపథ్యంలో, ఉపాధ్యాయులను వెంటనే నియమించాలని కోరుతూ గురువారం ఉదయం తరగతులు బహిష్కరించి విద్యార్థులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. సమాచారం అందుకున్న విద్యాశాఖ అధికారులు అక్కడకు చేరుకొని సమస్య పరిష్కరించేలా చర్యలు చేపడతామని హామి ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

నెల్లై, కన్నియాకుమారి ఎక్స్‌ప్రెస్ వేళల్లో మార్పులు

ప్యారీస్, ఆగస్టు 8: స్థానిక తాంబరం రైల్వే యార్డులో అభివృద్ధి పనుల కారణంగా ఈ నెల 14వ తేది వరకు 29 సూపర్‌ఫాస్ట్ రైళ్ల సేవలను మార్పు చేశారు. ఇందులో భాగంగా కొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లను 17వ తేది వరకు మార్పు చేస్తూ దక్షిణ రైల్వే ఓ ప్రకటన విడుదల చేసింది. తిరునల్వేలి-చెన్నై ఎగ్మూర్ ఈ నెల 15,16 తేదీల్లో బయల్దేరాల్సిన ఎక్స్‌ప్రెస్ రైళ్లు చెంగల్పట్టు-ఎగ్మూర్ మధ్య పాక్షికంగా రద్దయ్యాయి. కన్నియాకుమారి నుంచి ఈ నెల 15వ తేది ఎగ్మూర్ బయల్దేరాల్సిన రైలు చెంగల్పట్టు-ఎగ్మూర్ మధ్య పాక్షికంగా రద్దయింది. కన్నియాకుమారి నుంచి 14వ తేదిన వెళ్లే హజరత్ నిజాముద్దీన్ ఎక్స్‌ప్రెస్ విల్లుపురం, వేలూరు, కాట్పాడి, అరక్కోణం, పెరంబూర్ మీదుగా మళ్లించనున్నారు. ఆ రైలు పెరంబూర్ రైల్వేస్టేషన్‌లో ఉదయం 10.55 గంటలకు ఆగి వెళ్తుంది. 15వ తేది వెళ్లే హౌరా-తిరుచ్చి ఎక్స్‌ప్రెస్ పెరంబూర్, అరక్కోణం, కాట్పాడి, తిరువణ్ణామలై, విల్లుపురం మీదుగా మళ్లించనున్నారు. ఈ రైలు ఎగ్మూర్, తాంబరం మార్గంలో రద్దయింది.

పెన్నతూర్ పాఠశాల తనిఖీ



పాఠశాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, ఆగస్టు 8: ఆనైకట్టు పంచాయతీ యూనియన్ పరిధిలోని పెన్నాతూర్ ప్రభుత్వ పాఠశాలను కలెక్టర్ సుబ్బులక్ష్మి గురువారం తనిఖీ చేశారు. తరగతి గదిలోకి వెళ్లిన కలెక్టర్ బోధనాంశాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అలాగే, పాఠశాలలో అందజేస్తున్న అల్పాహారం, మధ్యాహ్న భోజనం తదితర నాణ్యత గురించి కలెక్టర్ విద్యార్థులను ప్రశ్నించారు.

250 కిలోల విత్తనాల సేకరణ



విద్యార్థులకు విత్తనాలు అందజేస్తున్న సమాజ సేవకుడు దినేష్ శరవణన్

వేలూరు, ఆగస్టు 8: స్థానిక వేలమ్మాళ్ సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థులకు సమాజ సేవకుడు దినేష్ శరవణన్ 250 కిలోల విత్తనాలు అందజేశారు. ఈ సందర్భంగా దినేష్ శరవణన్ మాట్లాడుతూ... జిల్లావ్యాప్తంగా కొండ ప్రాంతాల్లో ఇప్పటి వరకు 5 లక్షల విత్తనపు బంతులు వేసామన్నారు. పర్యావరణంపై విద్యార్థులకు అవగాహన కల్పించేలా కార్యక్రమం చేపట్టామన్నారు. విద్యార్థులు తమ పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు.

ఆలయ భూముల స్వాధీనం

ఐసిఎఫ్, ఆగస్టు 8: తూత్తుకుడి జిల్లా కయత్తారు సమీపంలో 140 ఎకరాల ఆలయ భూమిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కొత్తాలి గ్రామంలో ప్రాచీన నవనీతకృష్ణ పెరుమాళ్ ఆలయానికి చెందిన భూములు కలపైకట్టి, తెన్నంబట్టి, మరుదన్‌వాలు, కొత్తాలి వంటి గ్రామాల్లో ఉన్నాయి. కోట్లాది రూపాయల విలువైన ఆ భూములను కొందరు ఆక్రమించినట్లు దేవాదాయ శాఖ అధికారులకు ఫిర్యాదులందాయి. కొత్తాలి గ్రామంలో ప్రైవేటు వ్యక్తుల చేతిలో ఉన్న 140 ఎకరాల ఆలయ భూమిని అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు.

13 మంది సబ్ రిజిస్ట్రార్ల బదిలీ

ఐసిఎఫ్, ఆగస్టు 8: సబ్ రిజిస్ట్రార్లు 13 మందిని బదిలీ చేస్తూ ఆ శాఖ అధ్యక్షుడు దినేష్ పొన్‌రాజ్ ఆలీవర్ ఉత్తర్వులు జారీచేశారు. తిరువెన్నైనల్లూర్ సబ్ రిజిస్ట్రార్ శరవణన్ దక్షిణ చెన్నైకు, తిరువళ్లూర్ సబ్ రిజిస్ట్రార్ మణికంఠన్ చెంగల్పట్టుకు, వాలాజాబాద్ సబ్ రిజిస్ట్రార్ ఉత్తర చెన్నైకు, వేపూరు సబ్ రిజిస్ట్రార్ గోవిందరాజన్ వలవనూరుకు, చెన్నిమలై సబ్ రిజిస్ట్రార్ మహమ్మద్ ఇస్మాయిల్ రిజిస్ట్రేషన్ శాఖ ప్రధాన కార్యాలయానికి బదిలీ అయ్యారు. వీరితో పాటు 13 మంది వివిధ ప్రాంతాలకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

నీట మునిగి ముగ్గురు పిల్లల మృతి

పెరంబూర్, ఆగస్టు 8: సరదాగా స్నానాలకు వెళ్లిన ముగ్గురు బాలురు నీటమునిగి మృతిచెందిన ఘటన విల్లుపురం జిల్లాలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. దిండివనం సమీపం కోనేరికుప్పం ప్రాంతానికి చెందిన మారిముత్తు కుమార్తెలు మరియదర్శిని (10), సుభాషిణి (8) అదే ప్రాంతానికి చెందిన విజి కుమారుడు సంజయ్ (10)తో కలసి బుధవారం సాయంత్రం పాఠశాల నుంచి ఇంటికి తిరిగివస్తున్నారు. ఆ సమయంలో చెరువు సమీపంలో ఉన్న చెట్టు నుంచి నేరుడు పండ్లు కోసేందుకు ముగ్గురు యత్నించినట్లు సమాచారం. హఠాత్తుగా ముగ్గురు చెరువులో పడి నీటమునిగారు. సమాచారం అందుకున్న ఓలక్కూరు పోలీసులు, అగ్నిమాపక సిబ్బందితో అక్కడకు చేరుకొని చెరువులో గాలించి ముగ్గురి మృతదేహాలు వెలికితీసి, పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

16కు సెంథిల్ బాలాజీ కేసు విచారణ వాయిదా

పెరంబూర్, ఆగస్టు 8: మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ కేసు విచారణ ఈనెల 16వ తేదీకి వాయిదావేస్తూ చెన్నై ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి అల్లీ ఉత్తర్వులు జారీచేశారు. న్యాయమూర్తి ఉత్తర్వుల మేరకు గురువారం ఉదయం పుళల్ జైలు నుంచి భారీ పోలీసు బందోబస్తు నడుమ సెంథిల్ బాలాజీని కోర్టు విచారణకు హాజరయ్యారు. తనపై తప్పుడు కేసు పెట్టారని జడ్జి అడిగిన ప్రశ్నకు సెంథిల్ బాలాజి సమాధానమిచ్చారు. రాజకీయ కక్షల కారణంగా తనపై కేసు నమోదుచేశారని, సాక్ష్యులను క్రాస్ ఎగ్జామిన్ చేయాలని సెంథిల్ బాలాజీ న్యాయమూర్తిని అభ్యర్థించారు. ఈ కేసు తదుపరి విచారణ ఈ నెల 16కు వాయిదావేస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు.

డాక్టర్ సుబ్బయ్య పిటిషన్ తోసివేత

ప్యారీస్, ఆగస్టు 8: సస్పెన్షన్ ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ డా.సుబ్బయ్య దాఖలుచేసిన పిటిషన్‌ను మద్రాసు హైకోర్టు తోసిపుచ్చింది. రాయపేట ప్రభుత్వాసుపత్రిలో క్యాన్సర్ విభాగం వైస్ చైర్మెన్‌గా ఉన్న డా.సుబ్బయ్య తనపై అత్యాచారానికి పాల్పడ్డారని ఆరోపిస్తూ ఓ వైద్యురాలు చేసిన ఫిర్యాదు మేరకు ఆయనపై సస్పెన్షన్ వేటుపడింది. దానిని వ్యతిరేకిస్తూ సుబ్బయ్య తరఫున దాఖలైన పిటిషన్ హైకోర్టు న్యాయమూర్తి జీకే ఇలంద్రియన్ సమక్షంలో విచారణకు వచ్చింది. నర్సులు దుస్తులు మార్చుకొనే గదిలో ఎవరో కెమెరా ఏర్పాటుచేసి వీడియోగా రికార్డు చేశారని, దీనిపై సుబ్బయ్య రాయపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని, ఆ వీడియోలో ఉన్నది సుబ్బయ్య కాదని అతడి తరఫున హాజరైన న్యాయవాది తెలిపారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపేలా కమిటీ ఏర్పాటు చేయాలని న్యాయస్థానాన్ని కోరారు. సుబ్బయ్యకు వ్యతిరేకంగా అనేక ఫిర్యాదులున్నాయని, ఆయనపై న్యాయస్థానం కరుణ చూపరాదని ప్రభుత్వం తరఫున హాజరైన అడిషినల్ అడ్వొకేట్ జనరల్ రవీంద్రన్ కోరారు. వైద్యురాలి ఫిర్యాదు ఆధారంగానే సుబ్బయ్య సస్పెన్షన్‌కు గురయ్యారని, ఇందులో వేరే కారణాలు లేవన్నారు. ఇరుతరఫు వాదనల అనంతరం సుబ్బయ్య పిటిషన్‌కు సంబంధించిన తీర్పును తేది ప్రకటించకుండా జూలైకి వాయిదావేశారు. ఈ నేపథ్యంలో, మళ్లీ గురువారం ఈ పిటిషన్ విచారణకు రాగా న్యాయమూర్తి సుబ్బయ్య పిటిషన్‌ను తోసిపుచ్చుతూ ఉత్తర్వులు జారీచేశారు.

తమిళ జాలర్లపై సముద్రపు దొంగల దాడి

ప్యారీస్, ఆగస్టు 8: భారత సముద్ర సరిహద్దుల్లో చేపలు పడుతున్న తమిళ జాలర్లపై విరుచుకుపడిన శ్రీలంక సముద్రపు దొంగలు, 400 కిలోల చేపలు, వలలు, జీపీఎస్ పరికరం తదితరాలు దోచుకున్న సంఘటన రాష్ట్రంలోని కోస్తా జిల్లాల్లో కలకలం రేపింది. నాగపట్టణం జిల్లా వేదారణ్యం సమీపంలో ఉన్న ఆర్కాడుదురై ప్రాంతానికి చెందిన 10 మంది జాలర్లు మరబోటులో బుధవారం సముద్రంలో చేపల వేటకు వెళ్లారు. వారు అర్ధరాత్రి ఆర్కాడుదురైకు పశ్చిమ దిశగా 20 నాటికల్ మైళ్ల దూరంలో నడి సముద్రంలో చేపలు పడుతున్నారు. ఆసమయంలో ఫైబర్ బోటులో వచ్చిన ఐదుగురు నాటు తుపాకులతో బెదిరించి జాలర్లపై దాడికి పాల్పడ్డారు. అనంతరం పడవలో ఉన్న 400 కిలోల చేపలు, వలలు, జీపీఎస్ పరికరం, బ్యాటరీ, టార్చి లైట్, స్టవ్ తదితరాలు దోచుకొని పరారయ్యారు. ఈ దొంగల దాడిలో తీవ్రంగా గాయపడిన అన్బళగన్‌ను సహచరులు తీరానికి తరలించి గురువారం ఉదయం వేదారణ్యం ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. దీనిపై నాగపట్టణం జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

ఆగని లంక నావికాదళం ఆగడాలు

● 32 మంది జాలర్ల అరెస్ట్

పెరంబూర్, ఆగస్టు 8: శ్రీలంక నావికా దళం ఆగడాలు కొనసాగుతున్నాయి. తాజాగా నెడుదీవి సమీపంలో చేపలుపడుతున్న 32 మంది జాలర్లను శ్రీలంక నావికా దళం అరెస్ట్ చేసింది. రామనాథపురం జిల్లా పాంబన్ ఫిషింగ్ హార్బర్ నుంచి వందలాది మంది జాలర్లు బుధవారం రాత్రి చేపల వేటకు వెళ్లారు. పుత్తాలం సమీపంలో చేపలుపడుతున్న జాలర్లను శ్రీలంక నావికాదళం చుట్టుముట్టింది. సరిహద్దులు దాటి చేపలుపడుతున్నారని లంక నావికాదళం బెదిరించడంతో జాలర్లు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని హుటాహుటిన తిరుగు ప్రయాణమయ్యారు. వారిలో 32 మంది జాలర్లతో పాటు 4 పడవలను స్వాధీనం చేసుకున్న లంక నావికాదళం, వారిని శ్రీలంకలోని హార్బర్‌కు తరలించి విచారిస్తోంది.

తిరుచ్చి జైలులో ఆకస్మిక తనిఖీలు

● మూడు సెల్‌ఫోన్ల స్వాధీనం

ప్యారీస్, ఆగస్టు 8: తిరుచ్చి కేంద్ర కారాగార ప్రాంగణంలో ఉన్న శరణార్థుల శిబిరంలో గురువారం ఉదయం పోలీసులు తనిఖీలు నిర్వహించి మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ శరణార్థుల శిబిరంలో శ్రీలంక, నైజీరియా, బంగ్లాదేశ్, పాకిస్తాన్ సహా పలు దేశాల ఖైదీలు వంద మందికి పైగా ఉన్నారు. నకిలీ పాస్‌పోర్ట్‌తో ఎలాంటి వీసా లేకుండా దేశానికి తరలివచ్చి పట్టుబడిన వారిని కోర్టు ఉత్తర్వులు మేరకు ఈ శిబిరానికి తరలిస్తుంటారు. ఈ నేపథ్యంలో, వరుస దొంగతనాలు, దోపిడీ వంటి నేరాలకు పాల్పడిన శ్రీలంక ట్రింకోమలైకు చెందిన అబ్దుల్ రియాజ్ ఖాన్ (40)ను అరెస్ట్ చేసి పుళల్ సెంట్రల్ జైలుకు తరలించారు. అతనిని ఓ కేసు విచారణకు తిరుచ్చి కోర్టులో హాజరుపరచి శరణార్థుల శిబిరానికి తరలించారు. ఇక్కడి నుంచి ఈ నెల 2వ తేది తప్పించుకున్న అతడి కోసం పోలీసులు తీవ్రంగా గాలించి ఎట్టకేలకు అరెస్ట్ చేశారు. ఇదిలా ఉండగా, తిరుచ్చి నగర అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ సెల్వకుమార్ నేతృత్వంలో వంద మంది పోలీసులు గురువారం శిబిరంలో తనిఖీలు చేపట్టారు.

విద్యుదాఘాతానికి ఏనుగు మృతి



ఏనుగు కళేబరాన్ని వెలికితీసున్న అటవీ శాఖ సిబ్బంది

పెరంబూర్, ఆగస్టు 8: విద్యుదాఘాతంతో ఏనుగు మృతిచెందిన ఘటన నీలగిరి జిల్లాలో చోటుచేసుకుంది. గూడలూరు సమీపం శ్రీ మదురై వడవయల్ ప్రాంతానికి మంగళవారం రాత్రి రెండు ఏనుగులు వచ్చాయి. వాటిలో ఆడ ఏనుగు బాలకృష్ణన్‌కు చెందిన అరటి తోటలో ప్రవేశించేందుకు యత్నించగా, తోట చుట్టూ ఏర్పాటుచేసిన విద్యుత్ తీగ తగిలి షాక్‌కు గురై అక్కడే మృతి చెందింది. బుధవారం ఉదయం ఏనుగు మృతిచెందడాన్ని గుర్తించిన కొందరు అటవీ శాఖ అధికారులకు సమాచారమిచ్చారు. అధికారులు అక్కడకు చేరుకొని పరిశీలించగా, ఏనుగు నాలుగు కాళ్లు బురదలో చిక్కుకొని, నోట్లు విద్యుత్ వైరు ఉన్నట్లు గుర్తించారు. ఈ విషయమై అధికారులు మాట్లాడుతూ... ఈ ఘటనలో 20 ఏళ్ల ఏనుగు విద్యాదాఘాతానికి గురై మృతిచెందిందని, అనుమతి లేకుండా విద్యుత్ కంచె ఏర్పాటుచేసి పరారైన తోట యజమాని బాలకృష్ణన్ కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

ఆధ్యాత్మికం

అష్టోత్తరశత వైష్ణవ దివ్యదేశాల్లో 31వ ఆలయమే మైలాడుదురై జిల్లా సీర్గాళి సమీపం, తిరునాంగూరులోని తిరుసెంప్పొన్ సెయ్ కోయిల్. తిరుమంగై ఆళ్వార్ పెరియతిరుమొళిలో ఈ దివ్యాలయ విశేషాలను కీర్తిస్తూ మంగళాశాసనమొనర్చారు. రావణాసుర వధతో బ్రహ్మహత్యా దోషం నుంచి శ్రీరామచంద్రుడు విముక్తి పొందిన దివ్యదేశమిది. పరమశివుడి ప్రీత్యర్థం 11 రూపాలతో 11 గరుడవాహనాలపై మహా విష్ణువు దర్శనమిచ్చే అరుదైన వైష్ణవ క్షేత్రం కూడా. అత్యంత ప్రాచీనమైన ఈ ఆలయంలో పెరుమాళ్ తనను దర్శించేందుకు వచ్చే, ఆరాధించే భక్తకోటిని సకల సౌభాగ్యాలతో అనుగ్రహిస్తున్నారు - ఆంధ్రజ్యోతి, చెన్నై

అతి ప్రాచీన ఆలయం..

అరుదైన వైష్ణవ క్షేత్రం

- శ్రీరాముడికి దోషవిముక్తి కలిగించిన దివ్యదేశం
- ఏకాదశ గరుడసేవల దేవాలయం



పెరుమాళ్

స్థలపురాణం... : రావణాసురుడిని సంహరించిన తర్వాత శ్రీరామచంద్రమూర్తి అయోధ్యానగరానికి వెళ్తూ ఈ క్షేత్రంలోని దృఢనేత్రముని ఆశ్రమంలో బసచేశారు. రావణాసురుడిని సంహరించడం వల్ల శ్రీరాముడికి బ్రహ్మహత్యాదోషం ఏర్పడింది. రాముడు ఆ దోషాన్ని తొలగించుకునేందుకు దృఢనేత్రముని సలహా అడిగారు. ఆ మునీశ్వరుడి సలహా మేరకు బంగారంతో చేసిన గోవు విగ్రహంలో నాలుగు రోజులపాటు శ్రీరాముడు తపస్సు చేశారు. ఐదో రోజు ఆ విగ్రహాన్ని ఓ బ్రాహ్మణోత్తముడికి దానంగా ఇవ్వడంతో శ్రీరామచంద్రమూర్తి బ్రహ్మహత్యాదోషం నుంచి విముక్తులయ్యారు. ఆ బ్రాహ్మణోత్తముడు ఆ బంగారు గోవు విగ్రహాన్ని విక్రయించి, ఆ ధనంతో ఈ ఆలయాన్ని నిర్మించారు. అందుకే ఈ ఆలయాన్ని 'సెంప్పొన్ సెయ్ కోయిల్' (మేలిమిబంగారం ద్వారా నిర్మించిన ఆలయం) అనే పేరొచ్చింది.



అల్లిమామలర్ నాచ్చియార్, భూదేవి సమేత పెరుమాళ్

ఆలయ ఉత్సవాలు...

తమిళమాసం ఐప్పసి స్వాతి (పెరుమాళ్ నక్షత్రదినం) బ్రహ్మోత్సవాలు, తై అమావాస్య మరుసటి రోజున తిరునాంగూర్ గరుడోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయి. ఈ స్వామివారిని దర్శించుకుంటే కటిక దారిద్ర్యం నుంచి బయటపడవచ్చునని, వృత్తిలో పురోగతి సాధించవచ్చని, వివాహ, సంతాన, యోగాలు ప్రాప్తిస్తాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

ఎలా వెళ్ళాలి? : రాజధాని నగరం చెన్నై సహా రాష్ట్రంలోని పలు నగరాల నుంచి సీర్గాళి వెళ్లేందుకు ప్రభుత్వ రవాణా సంస్థ, ప్రైవేటు రవాణా సంస్థ బస్సులు ఉన్నాయి. సీర్గాళి నుంచి టౌన్ బస్సులు, వ్యాన్లు, టాక్సీలు, ఆటోల్లో తిరునాంగూరులోని ఈ ఆలయానికి చేరుకోవచ్చు. ఈ ఆలయాన్ని ప్రతిరోజూ ఉదయం 7నుండి 10 గంటల వరకు, సాయంత్రం 6 నుండి రాత్రి 8 గంటల వరకు తెరచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.

ఆలయవైభవం... : కనక విమానం దిగువన పెరుమాళ్ తూర్పుదిశగా భక్తులను అనుగ్రహిస్తున్నారు. సెంపొన్ రంగర్, హేరంబర్, పేరరుళాన్ అని పలు పేర్లతో పిలువబడే పెరుమాళ్ తనకు తానుగానే ఈ ఆలయాన్ని నిర్మించేందుకు సహాయపడ్డారు. పెరుమాళ్ పరమపదంలో ఉండటం వల్ల 'అరుళాలర్' అని పేరొందారు. ఎల్లవేళలా భక్తులను అనుగ్రహించడం వల్ల కూడా ఆ పేరొచ్చిందని వైష్ణవపండితులు చెబుతారు. ఈ ఆలయంలో అల్లిమామలర్ నాచ్చియార్, భూదేవి సమేతుడైన పెరుమాళ్ భక్తుల కోర్కెలను నెరవేరుస్తున్నారు. కాంచీపురంలో కటికదారిద్ర్యంతో బాధపడుతున్న కాశియప్పన్ అనే బ్రాహ్మణుడు ఈ క్షేత్రానికి వచ్చి మూడు రోజులపాటు 32వేల సార్లు అష్టాక్షరి మంత్రాన్ని ఉచ్ఛరిస్తూ ఆరాధించడంతో పెరుమాళ్ ఆ పేద బ్రాహ్మణుడికి సకల సౌభాగ్యాలు కల్పించినట్లు స్థలపురాణం.



పేరరుళాన్

ఏకాదశ గరుడ సేవలు... : బ్రహ్మహత్యాదోషం నుంచి విముక్తి పొందటానికి పరమేశ్వరుడు 'ఏకాదశ రుద్ర అశ్వమేధయాగం నిర్వహించారు. ఆ యాగం పూర్ణాహుతి సమయంలో పెరుమాళ్ ఆవిర్భవించి పరమేశ్వరుడికి దివ్యదర్శనమిచ్చి, రుద్రుడి కోరిక ప్రకారం తిరుమాళ్ ఏకాదశ (పదకొండు) రూపాలతో ఆయనతో నిత్యవాసం చేస్తూ భక్తకోటిని అనుగ్రహిస్తున్నారు. ఈ సంఘటన తెలిపేలా తమిళ తైమాసం అమావాస్య మరుసటి రోజు ఏకాదశ దివ్యదేశాలకు చెందిన పెరుమాళ్ళ తిరుమణికూడమ్ నుంచి 11 గరుడ వాహనాల్లో ఊరేగి భక్తులకు దర్శనమిస్తున్నారు. తిరునాంగూరులోని 11 దివ్యదేశాలు కూడా రుద్రుడిని ఆరాధించేందుకు ఏర్పడినవే అనటం అతిశయోక్తి కాదు.

మూలవర్లు : పేరరుళాన్
ఉత్సవమూర్తి : సెంప్పొన్ రంగన్, హేరంబర్
తాయార్ : అల్లిమామలర్ నాచ్చియార్
తీర్థం : నిత్యపుష్కరిణి, కనకతీర్థం
ఆగమం : పాంచరాత్రాగమం
విమానం : కనక విమానం





ఆలయ అంతర ప్రాకారం - ఆలయమండపం

చిత్రజ్యోతి



ఖతిజా రెహ్మాన్

సంగీత దర్శకురాలిగా ఏఆర్ రెహ్మాన్ కుమార్తె

- వెండితెరకు 'మిన్మిని'తో పరిచయం

ఆస్కార్ అవార్డు గ్రహీత, ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహ్మాన్ కుమార్తె ఖతిజా సంగీత దర్శకురాలిగా పరిచయమయ్యారు. 'మిన్మిని' అనే చిత్రంలో ఆమె అరంగేట్రం చేశారు. హలిదా షమీ దర్శకత్వంలో ఈ సినిమా రూపుదిద్దుకుంది. ఈ సినిమాలోని ఆడియో ఇప్పటికే రిలీజ్ కాగా, ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. రెహ్మాన్ సంగీతంలో 'యంతిరన్' చిత్రంలో 'పుదియ మనిదా...' అనే పాటను ఖతిజా ఆలపించి ప్రేక్షకులను ఉర్రూతలూగించిన విషయం తెల్సిందే. ఒక సినిమాకు తొలిసారి సంగీతం సమకూర్చడంపై ఖతిజా రెహ్మాన్ స్పందిస్తూ, 'ఈ తరుణం, అనుభవం ఎంతో సంతోషంగా, ఆనందకరంగా ఉంది. సరైన మార్గదర్శకత్వం చేసిన నా కుటుంబ సభ్యులకు, ఉపాధ్యాయులకే ఈ క్రెడిట్ దక్కుతుంది. 'మిన్మిని' వంటి చిత్రానికి సంగీతం అందించే అవకాశం వచ్చినందుకు చాలా సంతోషంగా ఉంది. అలాగే, తమిళంలోనే తొలి చిత్రానికి సంగీతం అందించే అవకాశం రావడం కూడా ఒక అదృష్టంగా భావిస్తున్నాను. ఇలాంటి అవకాశాన్ని ఇచ్చి అన్ని విధాలుగా అండగా నిలిచిన హలిదా, మనోజ్ పరమహంస, మురళిలకు ఆమె కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపారు.

వాస్తవ జీవితానికి చాలా దగ్గరగా ఉండే సినిమా

- 'కొట్టుకాలి' హీరో సూరి

'విడుదలై', 'గరుడన్' చిత్రాల తర్వాత తాను హీరోగా నటించిన 'కొట్టుకాలి' చిత్రం వాస్తవ జీవితానికి ఎంతో దగ్గరగా ఉంటుందని ఆ చిత్రం హీరో సూరి అన్నారు. ప్రముఖ హీరో శివకార్తికేయన్ నిర్మాతగా ఎస్‌పీ ప్రొడక్షన్ పతాకంపై ఈ చిత్రాన్ని నిర్మించారు. పీఎస్ వినోద్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ నెల 23వ తేదీ విడుదలకానుంది. దీనిని పురస్కరించుకుని, ప్రచార కార్యక్రమాలను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా బుధవారం హీరోయిన్ అన్నా బెన్‌తో కలిసి హీరో సూరి నగరంలో మీడియాతో ముచ్చటించారు. 'నా గత చిత్రాలకు భిన్నంగా ఈ మూవీ ఉంటుంది. 'విడుదలై', 'గరుడన్' చిత్రాలతో పోల్చితే పూర్తి భిన్నంగా, వైవిధ్య భరితంగా ఉంటుంది. ఇది మెయిన్ స్ట్రీమ్ కంటెంట్ మూవీ. వాస్తవ జీవితానికి చాలా దగ్గరగా ఉంటుంది. ఈ సినిమాలో వచ్చే పాండి అనే పాత్ర ప్రతి ఒక్కరి కుటుంబాల్లో ఉండే ఒక వ్యక్తి. ఈ సమాజం నేర్పించిన బంధుత్వాలు, నమ్మకాలను బలంగా విశ్వసించే ఒక పాత్రధారుడే పాండి. ఈ సమాజం తయారు చేసిన పాండి అనే పాత్రకు, నిజ జీవితంలో ఉండే పాండి అనే ఒక వ్యక్తికి మధ్య జరిగే మానసిక సంఘర్షణను వాస్తవ రూపంలో ప్రతిబింబించేందుకు ఎంతో శ్రద్ధ తీసుకున్నాం. ఆ పనిని సక్సెస్‌ఫుల్‌గా చేశామనే గట్టిగా నమ్ముతున్నాను. ప్రతి ఒక్కరూ చూడదగిన చిత్రంగా 'కొట్టుకాలి' ఉంటుందని గట్టిగా నమ్ముతున్నాను. ఇది ఒక ట్రావెల్ కథ. కోడిపుంజు కూడా ఓ పాత్ర పోషిస్తుంది. గ్రామీణ లోకేషన్‌లో చిత్రీకరించాం' అని పేర్కొన్నారు. హీరోయిన్ అన్నా బెన్ మాట్లాడుతూ, 'ఇందులో నా పాత్ర పేరు మీనా. ఇది నాలోని ఒక భాగమని తెలియదు. మనకు తెలియని అనేక అద్భుతమైన విషయాలను ఈ సినిమా వెల్లడిస్తుంది. 'కొట్టుకాలి' (మీన) ఎంత ప్రేమగా, మనోహరంగా ఉంటుందో అంతే బలంగా, దృఢంగా ఉంటుంది. ఈ ప్రయాణంలో మదురై మీదుగా మిమ్మల్నందరినీ తీసుకెళ్ళడానికి వేచి చూస్తున్నాం' అని పేర్కొన్నారు. కాగా, ఈ చిత్రానికి సంగీత దర్శకుడు లేరు. ప్రకృతిలో సహజసిద్ధంగా ఉండే ధ్వనులను అనుకరిస్తూనే ఆయా సన్నివేశాలకు అన్వయించారు. ఇప్పటికే విడుదలైన టీజర్ ప్రేక్షకులను నుంచి మంచి స్పందన వచ్చింది.



అన్నా బెన్‌కు సూచనలిస్తున్న దర్శకుడు వినోద్

అభిమానులకు హీరో విజయ్ షరతు!!

తన అభిమానులకు హీరో విజయ్ ఒక షరతు విధించారు. తాను నటించిన కొత్త చిత్రం 'ది గోట్' సినిమా ప్రమోషన్, ప్రచార కార్యక్రమాల్లో తాను స్థాపించిన 'తమిళగ వెట్రి కళగం' (పార్టీ) పేరు ఎక్కడా వినియోగించకూడదని కండిషన్ పెట్టారు. వెంకట్ ప్రభు దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం సెప్టెంబరు 25న విడుదలకానుంది. దీంతో ఈ సినిమా ప్రమోషన్ కార్యక్రమాలను ప్రారంభించింది. ఇందులో భాగంగా ఇప్పటికే మొదటి రెండు లిరికల్ సాంగ్‌లను విడుదల చేశారు. దీంతో అభిమానుల ఆనందానికి హద్దులు లేకుండా పోయాయి. అదే సమయంలో టీవీకే కార్యకర్తలు ఈ సినిమా ప్రచారంలో పాల్గొంటూ పార్టీ పేరు, పతాకాన్ని ఉపయోగిస్తున్నారు. వీటన్నింటినీ పరిశీలించిన ఆయన... 'ది గోట్' సినిమా ప్రమోషన్ కార్యక్రమాల్లో ఎట్టిపరిస్థితుల్లోనూ పార్టీ పేరు ఉపయోగించరాదని ఆదేశించారు. 'సినిమా వేరు.. రాజకీయాలు వేరు.. ఈ రెండింటినీ అనుసంధానం చేయొద్దం'టూ ఆయన స్పష్టం చేశారు.



'ది గోట్'లో విజయ్



గ్రాఫిక్స్ సినిమా 'మాయన్'

- సెప్టెంబరు 19న రిలీజ్

దాదాపుగా 50 శాతానికి పైగా గ్రాఫిక్స్ వర్క్స్‌తో రూపొందించిన చిత్రం 'మాయన్'. వచ్చే నెల 19వ తేదీన విడుదలకానుంది. చిత్రపరిశ్రమలో ఎవరూ ఊహించిన అనేక సినిమాలు భారీ విజయాన్ని సొంతం చేసుకున్నాయి. ఇలాంటి సక్సెస్‌ల వెనుక నటీనటులతో పాటు సాంకేతికవర్గం కూడా కీలకంగా వ్యవహరిస్తుంది. ఈ కోవకు చెందిన చిత్రమే 'మాయన్'. డైరెక్టుగా ఆంగ్లంలో నిర్మించి, తర్వాత తమిళంలో కూడా తెరకెక్కించారు. ఫాంటసీ, థ్రిల్లర్, హిస్టరీ మూడు జానర్లలో స్పష్టంగా సాగుతుంది. ఇవన్నీ ఒక మనిషి జీవితంలో తారసపడే అంశాలే. ఈ సినిమా నిర్మాణంలో దాదాపు 50 శాతానికిపైగా గ్రాఫిక్స్ వినియోగించారు. ఇది రెండు వెర్షన్లలో రూపొందించారు. ఒకటి మాయన్ క్యాలెండర్, మాయన్ వరల్డ్. రెండోది ప్రపంచం అంతమైందా? లేదా? మాయన్, దేవుడి మధ్య ఉన్న సంబంధం ఏంటి? అని చూపింది. మొదటి వెర్షన్‌లో కంటే రెండో వెర్షన్‌లోనే ఎక్కువ గ్రాఫిక్స్ ఉంటాయి. అయితే, తొలిభాగాన్ని మాత్రం థియేటర్‌లో విడుదల చేసి, రెండో భాగాన్ని ఓటీటీలో విడుదల చేసేలా ప్లాన్ చేశారు. జె.రాజేష్ ఖన్నా కథ సమకూర్చి దర్శకత్వం వహించారు. ఫాక్స్ అండ్ క్రో స్టూడియోస్ పతాకంపై నిర్మించారు. జీవీకేఎం ఎలిఫెంట్ పిక్చర్స్ టాటో గణేష్ మోహన సుందరం ఈ సినిమాకు సహ నిర్మాతగా వ్యవహరించారు. ఇందులో వినోద్ మోహన్, బిందు మాధవి ప్రధాన పాత్రలు పోషించారు. ఇంగ్లీష్ వెర్షన్‌లో ప్రియాంక మోహన్ కీలక పాత్ర పోషించారు. వీరితో పాటు పిజా బాజ్‌పాయ్, జాన్ విజయ్, ఆడుకలం నరేన్, సాయి దీనా, గంజా కరుప్పు, రాజ సింహన్, శ్రీరంజని, రంజనా నాచ్చియార్ తదితరులు నటించారు. చివరి దశ నిర్మాణ పనులను జరుపుకుంటున్న ఈ చిత్రానికి రూపర్ట్ జోన్స్ సంగీతం.

ఎంబీ డయాబెటిస్ ఆధ్వర్యంలో 'సేవ్ ఫీట్ - కీప్ వాకింగ్'



అవగాహన ప్రచారాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ విజయ్ విశ్వనాథన్

అడయార్, ఆగస్టు 8: నగరంలోని ప్రముఖ కార్పొరేట్ ఆస్పత్రి ఎంవీ డయాబెటిస్ ఆస్పత్రి 'సేవ్ ఫీట్ - కీప్ వాకింగ్' అనే వినూత్న అవగాహన కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ ప్రచారాన్ని ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ విజయ్ విశ్వనాథన్ ప్రారంభించారు. ఈ విషయంపై నగరంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మధుమేహ వ్యాధిగ్రస్తులు తమ పాదాలను రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇందుకోసం వారు క్రమం తప్పకుండా తమ పాదాలను చెకప్ చేసుకోవాలని కోరారు. ఇందుకోసం నెల రోజుల పాటు దేశ వ్యాప్తంగా అవగాహన ప్రచారాన్ని నిర్వహించామన్నారు. ఈ క్యాంపెయిన్‌లో దాదాపు 54 వేల మంది మధుమేహ వ్యాధిగ్రస్తుల పాదాలను పరీక్షించినట్టు తెలిపారు. ఇందులో 33,259 మంది పాదాల పరీక్షించి, సమగ్ర వివరాలను సేకరించి, వాటిని బ్రిటిష్ మెడికల్ కౌన్సిల్‌లో ప్రచురించినట్టు తెలిపారు. హైరిస్క్ పాదాలున్న ప్రతి నలుగురిలో ముగ్గురు కిడ్నీ, రెటీనా సమస్యలు ఉన్నట్టు గుర్తించినట్టు తెలతిపారు.

దిండిగల్ తలపాకట్టిలో ప్రత్యేక రాయితీలు

అడయార్, ఆగస్టు 8: నగరంలోని ప్రముఖ భోజన శాలల్లో ఒకటైన దిండిగల్ తలపకట్టిలో రెస్టారెంట్ ఫౌండర్స్ డే(వ్యవస్థాపక దినోత్సవం) సందర్భంగా ఈ నెల 12వ తేదీ సోమవారం స్పెషల్ ఆఫర్ ప్రకటించింది. ఆ రోజు ఉదయం 6 గంటల నుంచి అర్ధరాత్రి వరకు రూ.149కే బిర్యానీ విక్రయించనుంది. ఆ రెస్టారెంట్‌కు చెందిన 104 శాఖల్లో ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుందని దిండిగల్ తలపకట్టి ఎగ్జిక్యూటివ్ చైర్మన్ నాగస్వామి ధనపాలన్, చీఫ్ బిజినెస్ ఆఫీసర్ ఏ.సెంథిల్ కుమార్ వెల్లడించారు. ఈ విషయంపై వారు గురువారం నగరంలో మీడియాతో మాట్లాడుతూ, తమ వ్యవస్థాపకుడు దిండిగల్ నాగస్వామి ఈ రెస్టారెంట్‌ను స్థాపించి 67 యేళ్ళుపూర్తి చేసుకుంటున్న శుభసందర్భంలో ఈ ప్రత్యేక ఆఫర్‌ను 12వ తేదీ ఒక్క రోజు మాత్రం అందుబాటులో ఉంటుందన్నారు. ఆ రోజున రెస్టారెంట్‌లో తిన్నా, పార్శిల్ తీసుకెళ్ళినా లేదా ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసుకున్నా ఈ ధరే వసూలు చేస్తామన్నారు.



స్పెషల్ ఆఫర్ ప్రకటిస్తున్న నాగస్వామి ధనబాలన్, సెంథిల్ కుమార్

115 అడుగుల లోతున మైలాపూర్ మెట్రో రైల్వేస్టేషన్

- గ్రాఫిక్స్ విడుదల చేసిన సీఎంఆర్ఎల్

పెరంబూర్, ఆగస్టు 8: స్థానిక మైలాపూర్ మెట్రో రైల్వేస్టేషన్ మూడంతస్తులతో 115 అడుగుల లోతున నిర్మితం కానుంది. నగరంలో రూ.63వేల కోట్ల వ్యయంతో 116 కి.మీ మేర రెండవ విడత మెట్రోరైలు నిర్మాణనులు జరుగుతున్నాయి. అన్ని ప్రాంతాల్లో పనులు శరవేగంగా సాగుతుండగా, మైలాపూర్‌లో నిర్మిస్తున్న రైల్వేస్టేషన్ ఇతర స్టేషన్ల కన్నా లోతుగా, వెడల్పుగా ఉండనుంది. 115 అడుగుల లోతున నాలు గంతస్తులు అంటే పబ్లిక్ ఫాట్‌ఫారం, షాపింగ్ మాల్, ఎగువ ప్లాట్‌ఫారం, దిగువ ప్లాట్‌ఫారం అని నాలుగు అంతస్తుల్లో ఏర్పాటుకానుంది. అందులో మొదటి అంతస్తు (భూమి దిగువన 55 అడుగులు) మాధవరం-సిరుచ్చేరి సిప్కాట్ వెళ్లే ఓవర్‌హెడ్ రైళ్ళు, 2వ అంతస్తు (78 అడుగులు) లైట్ హౌస్-పూందమల్లి వెళ్లే రైళ్ళు, మూడవ అంతస్తు (115 అడుగులు) మాధవరం-సిప్కాట్ వెళ్లే భూగర్భ రైలు మార్గం ఏర్పాటు కానుంది. ఈ రైల్వేస్టేషన్‌కు సంబంధించిన గ్రాఫిక్స్ నమూనా ప్రస్తుతం విడుదలైంది.



మైలాపూర్ రైల్వేస్టేషన్ గ్రాఫిక్స్ నమూనా

నదుల్లో వరదల పర్యవేక్షణకు అత్యాధునిక పరికరాలు



తామ్రభరణి నదిలో ఏర్పాటైన పరికరాలు

పెరంబూర్, ఆగస్టు 8: రాష్ట్రంలోని సముద్ర తీర ప్రాంతాల్లో అలల ఉధృతి సహా పలు మార్పులను ముందుగానే పసిగట్టేలా 450 ప్రాంతాల్లో ఈడబ్ల్యూఎస్ అనే అధునిక హెచ్చరిక పరికరాలను విపత్తుల నిర్వహణ శాఖ ఏర్పాటు చేస్తోంది. అందులో భాగంగా తిరునల్వేలి కార్పొరేషన్ ద్వారా రూ.88 లక్షలతో తామ్రభరణి, రామనది, కడన తదితర నదుల్లో వరద ప్రవాహాన్ని ముందుగానే అంచనా వేసి హెచ్చరికలు పంపేలా పది ప్రాంతాల్లో ఈ పరిరకాల ఏర్పాటు శరవేగంగా జరుగుతోంది. ఈ పరికరం ద్వారా నదుల్లో వరద ఎప్పుడు వచ్చే అవకాశముంది సహా పలు వివరాలు పర్యవేక్షించి ఎస్ఎంఎస్ ద్వారా ఆ ప్రాంత ప్రజలను హెచ్చరించి తద్వారా వరద నష్టాలు అడ్డుకొనే అవకాశముంది. ఇందుకోసం కార్పొరేషన్, జిల్లా కలెక్టర్, ముఖ్యమైన కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటవుతున్నాయి. ఈ పరికరంలో కెమెరా, సెన్సార్ సౌకర్యం, సోలార్ ప్యానల్ తదితర ప్రత్యేక అంశాలు చోటుచేసుకున్నాయి.

హొగెనేకల్‌లో దోనెల సవారీకి అనుమతి



దోనెల సవారీలో పర్యాటకులు

పెరంబూర్, ఆగస్టు 8: కావేరి నదిలో నీటి ఉధ్రుతి తగ్గడంతో, హొగెనేకల్ జలపాతాల వద్ద గురువారం నుంచి దోనెల సవారీకి జిల్లా యంత్రాంగం అనుమతించింది. కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లోని కావేరి నది పరివాహక ప్రాంతాల్లో కొద్దిరోజులుగా కురుస్తున్న భారీవర్షాల కారణంగా కబిని, కృష్ణరాజ సాగర్ డ్యాంల నుంచి భారీగా అదనపు జలాలు విడుదల చేశారు. అందువల్ల కావేరి నదిలో సెకనుకు 2.30 లక్షల ఘనపుటడుగుల నీరు వస్తున్న నేపథ్యంలో, హొగెనేకల్ జలపాతాల వద్ద నీటి ఉధృతి అధికంగా ఉండడంతో దోనెల సవారీ నిలిపివేశారు. ఈ నేపథ్యంలో, వర్షాలు తగ్గుముఖం పట్టి, కావేరి నదిలో నీటి ఉధృతి తగ్గడంతో గురువారం నుంచి దోనెల సవారీకి జిల్లా యంత్రాంగం అనుమతించడంతో పర్యాటకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



చెన్నై క్యాంప్ కార్యాలయంలో గురువారం ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన తిరునల్వేలి కార్పొరేషన్ మేయర్ జి.రామకృష్ణన్



చెన్నై క్యాంప్ కార్యాలయంలో గురువారం ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను కలిసి ఆశీస్సులు అందుకుంటున్న కోవై కార్పొరేషన్ మేయర్ రంగనాయకి



గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ చేపట్టిన 'జీరో యాక్సిడెంట్ డే' ప్రచారంలో భాగంగా చెన్నై ఎగ్మూర్‌లోని రాష్ట్ర మహిళా మహోన్నత పాఠశాలల విద్యార్థులకు హెల్మెట్లు అందజేస్తున్న దృశ్యం